# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 257 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం, 24 ఆగస్టు 2026 | పేజీలు :4




జాతీయ స్థాయి కరాటేలో సత్తా చాటిన రెండేళ్ల బుడతడు

3



# రాజ మహేంద్ర నాయక్ IPS

- జనగామ డీసీపీకి ఐపీఎస్ హోదా
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర హోం శాఖ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) గా విధులు నిర్వహిస్తున్న బి. రాజ మహేంద్ర నాయక్ ఐపీఎస్ కేడర్‌కు ఎంపికయ్యారు. తెలంగాణ కేడర్‌కు చెందిన పలువురు నాన్ క్యాడర్ ఎస్పీలకు ఐపీఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర హోంశాఖ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా 2025 సెలెక్ట్ లిస్ట్ ఆధారంగా రాజ మహేంద్ర నాయక్‌ను ఐపీఎస్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నియామక ప్రక్రియలో భాగంగా ఆయన ఏడాది పాటు ప్రొబేషన్ కాలంతో పాటు అవసరమైన ఇండక్షన్ శిక్షణను పూర్తి చేయనున్నారు. దీర్ఘకాలంగా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో సేవలు అందిస్తూ, ప్రస్తుతం జనగామ డీసీపీగా పనిచేస్తున్న రాజ మహేంద్ర నాయక్ ఐపీఎస్ హోదా పొందడం పట్ల తోటి అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు ఐపీఎస్ హోదా దక్కడంతో పలువురు సీనియర్ పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజా సేవకు ఈ హోదా మరింత తోడ్పడుతుందని వారు ఆకాంక్షించారు.

## ప్రజావాణిలో వినతి.. అరగంటలోనే సమస్య పరిష్కారం

- చిన్నారికి ఆరోగ్యశ్రీ కార్డు

2 లో



## వన మహోత్సవ లక్ష్యాలు పూర్తి చేయాలి

- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి కొండా సురేఖ



3 లో


wanted

విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# 27న గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి



**జనగామ, మన చౌరాస్తా :** ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనంలో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రంలో సభలు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత బీఎల్ఓలు, చునావ్ పాఠశాల సభ్యులు సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ సభలు, వార్డు సభల నిర్వహణపై బీఎల్ఓల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సభల వద్ద ఫారం 6, ఫారం7, ఫారం8, తదితర అవసరమైన ఫారాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. గ్రామ, వార్డు సభల్లో బీఎల్ఓలు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోని ఓటర్ల పేర్లను చదివి వినిపించాలని, జాబితాలో పేరు లేని అర్హత కలిగిన భారతీయ పౌరులను గుర్తించాలని సూచించారు. 01.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే వారు ఫారం6తో పాటు డిక్లరేషన్ ఫారం, అవసరమైన ఆధారాలను సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు (లేదా) ఇతర వివరాల్లో తప్పులు, వ్యత్యాసాలు ఉన్నట్లయితే ఫారం8 ద్వారా సవరణలకు దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు వివరించాలన్నారు. అర్హత లేకపోయినా జాబితాలో పేరు నమోదైన వారిని గుర్తించి, అదే నియోజకవర్గానికి చెందిన ఓటరు ఫారం7 ద్వారా అభ్యంతరం సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లందరికీ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం 7 రోజుల వ్యవధి ఉండేలా చూడాలని సూచించారు. నోటీసులు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఫోటోతో సహా నమోదు చేయాలని తెలిపారు. విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గ్రామ సభలు, వార్డు సభల నిర్వహణకు సంబంధించిన వివరాలను సక్రమంగా డాక్యుమెంటేషన్ చేసి, సభల ఫొటోలను బీఎల్ఓ రిజిస్టర్‌లో భద్రపరచాలని సూచించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వివరిస్తూ.. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 27న నిర్వహించనున్న గ్రామ సభలు, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల వారీగా అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో వినతి.. అరగంటలోనే
# సమస్య పరిష్కారం

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా సాగుతున్న 'ప్రజావాణి' కార్యక్రమం మరోసారి ఓ నిరుపేద కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవతో ఓ చిన్నారికి ఆరోగ్యశ్రీ కార్డులో పేరు నమోదై, శస్త్రచికిత్సకు మార్గం సుగమమైంది. బాణాపురం కాలనీకి చెందిన రోజువారీ కూలీ మహమ్మద్ రఫత్ తన ఏడాది కుమార్తె అల్ఫియనూర్ కంటి సమస్యతో బాధపడుతుండటంతో హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేయించాల్సి వచ్చింది. అయితే ఆరోగ్యశ్రీ కార్డులో పాప పేరు నమోదు కాకపోవడంతో ఉచిత వైద్యం అందక ఆందోళన చెంది, ప్రజావాణిలో కలెక్టర్‌ను ఆశ్రయించారు. బాధితుడి వినతిపై తక్షణమే స్పందించిన కలెక్టర్, అధికారులను ఆదేశించి కేవలం అరగంట వ్యవధిలోనే చిన్నారి పేరును ఆరోగ్యశ్రీ కార్డులో నమోదు చేయించారు. అత్యవసర సమయంలో వేగంగా స్పందించి తమను ఆదుకున్న జిల్లా కలెక్టర్‌కు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ప్రజావాణిలో 186 దరఖాస్తుల స్వీకరణ





**జనగామ, మన చౌరాస్తా :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వచ్చిన అర్జీలను పరిశీలిస్తూ ఆర్జీదారుల సమస్యలను పూర్తిగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతి వినతిపై నిర్లక్ష్యం లేకుండా స్పందించి, నిర్ణీత గడువులో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో 186 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన కొన్నింటి ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి..

జఫర్గడ్ మండలం, తీగవరం గ్రామానికి చెందిన వై. రాజు, తను 6 ఎకరాల 21 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేయగా, ఆ భూమి రిజిస్ట్రేషన్ జరగకుండా సంఘం సభ్యులు ఆపారని, ఆ భూమి రిజిస్ట్రేషన్ తన పేరు మీదకు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.

చిల్పూర్ మండలం, రాజవరం గ్రామానికి చెందిన ఇమ్మడి నర్తకి, తన 2.27 గుంటల భూమిని అమ్ముకునేందుకు తన బావ అడ్డుపడుతున్నారని, ఆ భూమిని అమ్ముకునేందుకు తన బావ నుంచి రక్షణ కల్పించి, న్యాయం చేయాలని విన్నవిస్తూ దరఖాస్తు చేసియున్నారు.

పాలకుర్తి మండలం, మేకలతండా గ్రామానికి చెందిన ఎల్. స్వర్ణ, తమ గ్రామానికి సెగ్రిగేషన్ షెడ్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం జరిగిందని, కానీ స్థలం లేదని, ఈ విషయమై స్థలం కేటాయించాలని మనవి చేస్తూ వినతిపత్రం సమర్పించారు.

జిల్లా కేంద్రంలోని సంజయ్ నగర్ కు చెందిన ఎం. సరిత, తన కుమారుడు ఎం. మణిదీప్ కు దివ్యాంగుల పింఛను రెండు నెలలుగా నిలిపివేయడం జరిగిందని, ఆధార్ కార్డులో వివరాల సవరణ చేయాలని, ఈ మేరకు నిలిచిన పింఛన్ను వెంటనే పునరుద్ధరించి, పింఛను జమ చేయాలని ఆర్జీ ద్వారా కోరారు.

కొడకండ్ల మండలం, ఏడునూతుల గ్రామానికి చెందిన ముత్తినేని శోభ, తన ఒక ఎకరం భూమిని మణమ్మ పేరు మీదకు పట్టా చేయించారని, ఈ విషయమై విచారణ జరిపించి, ఆ భూమిని తన పేరు మీదకు ఎక్కించగలరని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేశారు.

ఈ ప్రజావాణిలో ఎస్ఈ ఎన్పీడీసీఎల్ సంపత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, డీపీఓ వెంకట్ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## జాతీయ స్థాయి కరాటేలో సత్తా చాటిన
# రెండేళ్ల బుడతడు




**జనగామ, మన చౌరాస్తా :** విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో జనగామ నియోజక వర్గం చేర్యాల మండలం పరద్ద రాజుపేట కు చెందిన రెండేళ్ల చిన్నారి కొయ్యడ అయాంష్ గౌడ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. తనకంటే పెద్దవాడైన ఐదేళ్ల ప్రత్యర్థితో ధైర్యంగా స్పారింగ్ చేసి సిల్వర్ మెడల్‌తో రెండో స్థానం సాధించాడు. చిన్న వయసులోనే జాతీయ స్థాయి పోటీలో పాల్గొని ఏమాత్రం భయపడకుండా పోరాడిన అయాంష్ గౌడ్ ఆటతీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. అతడి ఆత్మవిశ్వాసం, పట్టుదలను చూసి పలువురు అభినందించారు. ప్రముఖ సినీ నటుడు హీరో సుమన్, విక్టరీ షోటోకాన్ కరాటే ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ ఆర్. మల్లికార్జున్ గౌడ్, విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ జనగామ జిల్లా ప్రెసిడెంట్ ఓరుగంటి సంతోష్ కుమార్, చిన్నారి ప్రతిభను అభినందించి ఆశీర్వదించారు. రెండేళ్ల వయసులోనే జాతీయ స్థాయిలో పతకం సాధించడం పట్ల అయాంష్ తండ్రి కొయ్యడ ప్రసాద్ గర్వం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, అందరి ఆశీస్సులు అయాంష్‌కు ఉండాలని ఆకాంక్షించారు.





# వన మహోత్సవ లక్ష్యాలు పూర్తి చేయాలి

- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి కొండా సురేఖ

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవం కింద నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి వంద శాతం పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రంలో 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు మంత్రి తెలిపారు. వర్షకాల అనుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుంటూ జిల్లాల్లో సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమాలను ఉధృతంగా చేపట్టాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కకు తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయాలని, వాటి సంరక్షణ మరియు మనుగడపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు మరియు ప్రజలందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. జిల్లాలో నిర్దేశించిన 25.921 లక్షల మొక్కల లక్ష్యంలో ఇప్పటికే 13.842 లక్షల మొక్కలు (53.40 శాతం) నాటామని వెల్లడించారు. మిగిలిన లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



# స్కూళ్లు, కాలేజీల వద్ద పొగాకు విక్రయం నేరం

**జనగామ, మన చౌరాస్తా :** పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం నేరమని నార్కోటిక్ ఎస్ఐ పల్లకొండ సారయ్య హెచ్చరించారు. జనగామలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్, ఎస్‌బీ పోలీసు సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలపై ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.



# జనగామలో ఏటీసీ నిర్మాణ పనులను ప్రారంభించాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ నియోజకవర్గానికి మంజూరైన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) పనులను తక్షణమే ప్రారంభించాలని కోరుతూ నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి, రాష్ట్ర కార్మిక శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.వి. నగేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. మంజూరై ఏడాది కావస్తున్నా ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చంపకిల్స్‌లో కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని రెవిన్యూ, సర్వే అధికారులు ఇప్పటికే హద్దులు నిర్ధారించి తెలంగాణ మౌలిక సదుపాయాల సంస్థ (TGIIC)కి అప్పగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ స్పందిస్తూ, త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే స్థానిక నిరుపేద యువతకు ఆధునిక శిక్షణతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మరియు స్వయం ఉపాధి కింద సొంతంగా కంపెనీలు స్థాపించుకోవచ్చని ప్రతినిధులు పేర్కొన్నారు.




# రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్‌లో జనగామ సేజ్ విద్యార్థుల ప్రతిభ

- జాతీయస్థాయి పోటీలకు 20 మంది ఎంపిక

**హైదరాబాద్, మన చౌరాస్తా :** హైదరాబాద్‌లోని బి.ఎన్.రెడ్డి నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో జనగామలోని సేజ్ హైస్కూల్ (CBSE) విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచి రికార్డు సృష్టించారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఒకే పాఠశాలకు చెందిన 20 మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్10, 12, 14, మరియు 17 విభాగాల్లో పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ వి. రోహన్ రెడ్డి అభినందించారు. ఒకే పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తామని జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలమాకుల కుమార్ తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు ప్రశంసలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.




# 'సారంపల్లి' ఆశయాలను కొనసాగిస్తాం..

## సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** సీపీఎం సీనియర్ నాయకులు, ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామని సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి స్పష్టం చేశారు. జనగామలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు, కార్మికులు, పేదలు మరియు సామాన్య ప్రజల హక్కుల కోసం సారంపల్లి మల్లారెడ్డి జీవితాంతం చేసిన పోరాటాలు ప్రజా ఉద్యమాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన చూపిన పోరాట మార్గంలోనే ముందుకు సాగుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. మల్లారెడ్డి ఆశయాల సాధనకు ప్రతి ఒక్క కార్యకర్త పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, సుంచు విజేందర్, బోడ నరేందర్, భూక్య చందు నాయక్, పుతుకనూరి ఉపేందర్, ఎండి అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు బాల్న వెంకట మల్లయ్య, మంగ వీరయ్య, దాసగొని సుమ, నాయకులు సిద్దిరాల ఉపేందర్, ఎండి మున్నీర్, బిక్షపతి, గంగరబోయిన మల్లేష్, రాజ్, మోకు విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల ముందు ఆక్రమణలు తొలగించాలి

**నర్మెట, మన చౌరాస్తా :** నర్మెట మండల కేంద్రంలోని ఎంపీడీఓ ఎంఆర్ఓ ఈజీఎస్ తదితర ప్రభుత్వ కార్యాలయాల ముందు ప్రధాన రహదారిపై ప్రైవేట్ వ్యక్తుల వ్యాపార కార్యకలాపాలు నిర్మాణాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొంటూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు ప్రతిరోజూ వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారని అయితే కార్యాలయాల ముందు ఉన్న ప్రాంతంలో హోటళ్లు జిరాక్స్ సెంటర్ తదితర ప్రైవేట్ వ్యాపారాలు నిర్వహించడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఫిర్యాదుదారు కోలెపాక సూర్యం పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ముందు ఉన్న స్థలాన్ని అధికారులు పరిశీలించి ప్రభుత్వ స్థలం లేదా రహదారి పరిధిలో ఆక్రమణలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం తొలగించాలని కోరారు అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గాన్ని ఖాళీగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ విషయంపై అధికారులు స్థల పరిశీలన నిర్వహించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోలెపాక సూర్యం కోరారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**